


## భక్తితో...మహాయజ్ఞంలా ఆలయ శుద్ధి

### -ఉదయం 11గంటలకు సర్వదర్శనం ఆరంభం



తిరుమల,సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండలదేవునికి వారంరోజుల్లో ప్రారంభంకానున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారంగా మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. భక్తితో,మహాయజ్ఞంలా చేపట్టిన ఈ ఆలయ శుద్ధి ఉదయం 6గంటల నుండి 10గంటల వరకు సాగింది. సుగంధద్రవ్యాలు పవిత్రపరిమళ జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. ఈ కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, కుటుంబం, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, టిటిడి అధికారులు,,అర్చకులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

### ఫలించిన ఎంపి గురుమూర్తి కృషి



తిరుపతి రవాణ, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

తిరుపతి పట్టణంలోని హీరో హోండా షోరూం ఎదురుగా ఉన్న రైల్వే గేటు స్థానంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 12.23 కోట్లు నిదులు మంజూరు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లతో పట్టణం సర్వాంగ సుందరంగా తయారైందని కాని పట్టణం రైల్వే లైన్‌కి ఇరువైపులా విస్తరించి ఉండటం వలన రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని స్థానిక ఎమ్మెల్యే, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదన చేయగా మొదట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో నిర్మించాలని రైల్వే శాఖ ప్రతిపాదించగా తదుపరి రైల్వే మంత్రిత్వ శాఖతో జరిపిన చర్చలలో అండర్ బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి స్థాయి నిధుల మంజూరుకు అంగీకారం లభించిందన్నారు. పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డిని ఎంపి గురుమూర్తి ప్రశంసించారు.

## రోజాకు మతిభ్రమించి పిచ్చిగా మాటలు

### అక్రమకేసు పెడితే సంబరాలు ఏమిటని టిడిపి నేతల ఆగ్రహం



రేణిగుంట/తిరుపతి,సెప్టెంబర్ 12ప్రభాతవార్త:

రాష్ట్రంలో నియంత పాలన ఉందని, ఈ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గాలిభానుప్రకాష్ అన్నారు. ప్రతిపక్షనేత, మాజీ సిఎం చంద్రబాబుపై కుట్రతో అక్రమంగా తప్పు కేసులు నమోదు చేసి, వ్యవస్థలను మేనేజ్‌చేసి జగన్ జైలుకు పంపితే మంత్రి రోజా సంబరాలు చేసుకోవడం ఆమె దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు. ఆమె శాఖను గాలికి వదిలేసి, అభివృద్ధి అంటే ఏమిటో తెలియని ఆమె, ఆ శాఖకు మచ్చగా మారారన్నారు. గత రెండేళ్ళలో ఆమె మంత్రిగా తన సొంత నియోజకవర్గానికి, జిల్లాకు, రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మంగళవారం రేణిగుంటలోని వైకన్వెన్షన్‌లో జరిగిన బాబుగారికి తోడుగా,ఒక నియంతపై పోరాటం పేరుతో టిడిపి నేతల సమావేశంలో గాలిభానుప్రకాశ్ మాట్లాడారు. చంద్రబాబు ప్రజల కోసమే పాలన సాగించారని, ముఖ్యమంత్రిగా ఆయన నిజాయితీని దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొనియాడుతున్నారన్నారు. జగన్ కుట్రపూరితంగా కక్షతో పనిగట్టుకుని తప్పుడు కేసులు నమోదు చేసినంత మాత్రాన టిడిపి ఎక్కడా భయపడదన్నారు. న్యాయస్థానంలో తన నిజాయితీని నిరూపించుకుని నిర్దోషిలా బయటకు వస్తారని అన్నారు. జరిగిన అక్రమాలపై ,నియంతపై కలసి పోరాటం చేస్తామని, చంద్రబాబుకు అండగా ఉంటామన్నారు. రోజాకు ఇక టిక్కెట్ రాదనే భయంతో పిచ్చికూతలు కూస్తోందని భానుప్రకాశ్ ఎద్దేవాచేశారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు దొరబాబు, నరసింహయాదవ్, గౌనివారి శ్రీనివాసులు, పులివర్తినాని, సుగుణమ్మ, సురేంద్రబాబు, ఊకా విజయకుమార్, కుమారమ్మ, కృష్ణయాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పక్కాగా వాటర్‌షెడ్ పనులు

### వీధి దీపాలకు సోలార్ కనెక్షన్లు ఏర్పాటు
### పంచాయతీరాజ్ కమీషనర్ సూర్యకుమారి




పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా చేపట్టిన పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కమీషనర్ సూర్యకుమార్చి

చిత్తూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో వాటర్‌షెడ్ పనులు పక్కాగా జరుగుతున్నాయని పంచాయతీరాజ్ కమీషనర్ సూర్యకుమారి పేర్కొన్నారు. జడ్పీ సమావేశహాలులో మంగళవారం పంచాయతీరాజ్ కమీషనర్ సూర్యకుమారి జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో జిల్లా పంచాయతీ అధికారులు లక్ష్మీ, ధనలక్ష్మిలతో కలిసి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ కమీషనర్ సూర్యకుమారి మాట్లాడుతూ ఉపాధి పథకంలో ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్లను ఎపిడిలతో మాట్లాడి సోలార్ సిస్టంను ఏర్పాటు చేయాలని, ఇలా చేయడంతో గ్రామాల్లోని వీధి దీపాలకు సోలార్ కనెక్షన్లు ఇవ్వడంతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. అలాగే గ్రామ స్థాయిలో జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు సర్వేయర్లు పూర్తి సహకారం అందించాలన్నారు. పంచాయతీల పరిధిలో వ్యవసాయ భూముల సర్వే పూర్తయిన అనంతరం స్వామిత్వ సర్వే పూర్తి చేయడానికి సర్వేయర్లు సహకారం అందించాలన్నారు. అలాగే గ్రామ, మండల స్థాయిల్లో వున్న ప్రభుత్వ ఆస్తులను జాగ్రత్తగా కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఇఓపిఆర్డీలు, డిఎల్‌డిఓలు, తహసిల్దార్లపై వుందన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకొన్న వారికి నోటీసులు ఇవ్వాలని, అందులో 21 రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చి, ఆపై మరో నోటీసు జారీ చేసి వారి నుండి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీ ఫేస్‌బుక్, ట్విట్టర్ అకౌంట్‌లు ఓపెన్ చేసి గ్రామ స్థాయిలో జరిగే అభివృద్ధికి సంబంధించి పనులను అప్‌లోడ్ చేయాలని కమీషనర్ ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా పనుల కోసం 27 కోట్ల రూపాయల మంజూరుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మంజూరైన వెంటనే నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిఎల్‌డిఓలు రవికుమార్, లక్ష్మీపతి, ఉమాదేవి, ఇఓపిఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేయండి

### -సిఎం జగన్‌కు టిటిడి ఆహ్వానం

తిరుమల,సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామికి 18వదేదీ నుండి 26వరకు జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టిటిడి పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు గరుడసేవకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు ముందుగానే బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యే రోజు రావడం ఆనవాయితీ. మంగళవారం మధ్యాహ్నం ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి ,మంత్రి కొట్టుసత్య నారాయణతో కలసి తాడేపల్లికి చేరుకున్నారు. టిటిడి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కక్షసాధింపు కుట్రతోనే చంద్రబాబుపై చర్యలు

### ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారు -టిడిపి,జనసేన నాయకులు



తిరుపతి,సెప్టెంబర్ 12ప్రభాతవార్త:

రాష్ట్రంలో వైసిపి దురహంకార పాలనలో ప్రజలు విసిగిపోయారని, అనవసరంగా కక్షసాధింపు కుట్రతో ప్రతిపక్షనాయకులు, కార్యకర్తలను బెదిరించి ఇబ్బందులుకు గురిచేస్తున్నారని టిడిపి, జనసేన నాయకులు మండిపడ్డారు. మూడురోజులుగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే నిరంకుశ పాలన సాగుతోందా అనే ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, కేసు లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో అక్రమాలు జరిగాయనే నెపంతో టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా బెదిరింపు కేసులతో జైల్లో పెట్టారన్నారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో వైసిపికి బుద్ధిచెప్పేందుకు సిద్దంగా ఉన్నారని టిడిపి నేతలు సుగుణమ్మ, ఆర్‌సి మునికృష్ణ, బుల్లెట్‌రమణ, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్, వట్టికుంట చిన్నబాబు, జనసేన నాయకులు కిరణ్‌రాయల్, రాజారెడ్డి,పార్టీ నాయకులు, కార్యకర్తలు మీడియాతో మంగళవారం తమ ఆవేదన వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, ఫిర్యాదులు లేకుండా వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ ఆయన అనుచరులు అక్రమంగా కేసులు నమోదు చేయడం, టిడిపి కేడర్‌ను బెదిరింపులకు గురిచేయడమేనన్నారు. ఇలాంటి అక్రమాలకు టిడిపి బెదరదని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు, యువతకు ఉపాధి, ఉద్యోగ శిక్షణ ఇప్పించడంలో చంద్రబాబు పనితీరు విదేశాల్లోనూ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు అభినందిస్తున్నారన్నారు. గత నాలుగేళ్ళలో వైసిపి ప్రభుత్వం దోచుకున్నది చాలక, జనంనెత్తిన బాదుడు చేయడమేగాక ఇప్పుడు అక్రమం,అవినీతి అంటూ తప్పుడు కేసులతో భయపెడుతోందన్నారు. ప్రజలకు నేనున్నాంటూ సంక్షేమ పథకాల మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబుపై నేరుగా పోరాటం చేయలేక ,న్యాయంగా ఎదుర్కోలేక ఎన్నికల్లో గెలవలేమనే భయంతో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. ఇందుకు త్వరలోనే రివేంజ్ కూడా ఉంటుందని హెచ్చరించారు. తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. ప్రజలు టిడిపి వైపే, చంద్రబాబు నాయకత్వం కోరుకుంటున్నారని అన్నారు. జరిగిన తప్పులకు వైసిపి నిజం తెలుసుకుని చంద్రబాబును విడుదల చేయాలని టిడిపి, జనసేన అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు.

## కొనసాగుతున్న తెదేపా నేతల రిలే నిరాహార దీక్షలు



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా కుప్పంలో తెలుగుదేశం పార్టీ నేతలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. స్థానిక బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెదేపా నేతలు, కార్యకర్తలు దీక్షలు చేపట్టారు. అంతకుముందు స్థానిక శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయంలో చంద్రబాబుకు త్వరగా బెయిల్ రావాలని కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలను జరిపారు.

### - చంద్రబాబు బెయిల్‌కై
### గంగమ్మ ఆలయంలో పూజలు

కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు డా॥ వెంకటేష్,కాణిపాకం వెంకటేష్,కన్నన్, మంజునాథ్, మణి, జయరాంనాయుడు,సురేష్, వేణు, సతీష్, కౌన్సిలర్ వేలు, ప్రకాష్, తెలుగు మహిళ నేతలు అనసూయ, శారదమ్మ,సుగుణమ్మ, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చెక్కునత్తంలో గ్రామదేవత శ్రీమారియమ్మ ఆలయంలో చంద్రబాబుకు బెయిల్, ఆరోగ్యం కోసం రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి చెక్కునత్తం మణి అధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మునిరత్నం, తిమ్మప్ప, బీరప్ప, నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురంలో :**

తెదేపా అధినేత చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని ఆయనకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని దేశం నేతలు వివిధ ఆలయాల్లో పూజలు జరిపారు. రాళ్లబూదుగూరు వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మణి, బసవరాజు, కుమార్, జయరాజ్, మురళి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మోకాళ్ళపై నిరసన



తొట్టంబేడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

గత మూడు రోజులుగా జరుగుతున్న సంఘటనలకు ఆవేదనతో తెలుగుమహిళలు ఆధ్వర్యంలో నారాచంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుని ఖండిస్తూ స్థానిక పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయ ఆవరణలో మహిళలు మోకాళ్ళమీద నిలబడి నమస్కారం చెబుతూ మాజీ ముఖ్యమంత్రికి ప్రాణహాని ఉంది కాపాడండంటూ వేడుకున్నారు. శాంతియుతంగా ధర్నాలు చేసినా నిరాహార దీక్షలు చేసిన హౌస్‌అరెస్టు చేస్తూ పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని వైసిపి నాయకులు అడ్డగోలుగా పరిపాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కక్షపూరితమైన చర్యలకు పాల్పడుతూ రాజకీయం చేస్తున్నారని అరాచకాలు, దౌర్జన్యాలు చేస్తూ భయాందోళనలు కలిగిస్తూ ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి రిమాండ్‌కు పంపడం వైకాపా నాయకులు పరాకాష్టకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, లక్ష్మి, కుమారి, సునీమా, చంద్రకళ, సుజాత, అనిత, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాల లక్ష్యాలు సత్వరం పూర్తి

### - కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

జిల్లాకు నిర్ధేశించిన ఇళ్ళ నిర్మాణాలను మండల, మున్సిపల్ అధికారులు హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకొని పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ హౌసింగ్ పిడి పద్మనాభంతో కలిసి ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై ఎపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 73,584 ఇళ్ళు మంజూరు కాగా 68,543 ఇళ్ళ నిర్మాణాలు వివిధ దశల్లో వున్నాయన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి సిమెంటు, ఇసుక, కమ్మి, గృహ నిర్మాణ సామాగ్రికి ఎలాంటి ఇబ్బందులు లేదని, అక్టోబర్ నెల నుండి వర్షాలు ప్రారంభమైతే ఇళ్ళ నిర్మాణాలు చేపట్టడం కష్టమవుతుందని, అప్పటిలోపు ఆర్‌సి స్థాయి నుండి కంప్లీషన్ స్థాయిలో వున్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే వివిధ దశల్లో వున్న ఇళ్ళ నిర్మాణాలను అధికారులు, ఇళ్ళ లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులకు నిర్ధేశించిన లక్ష్యాలు పూర్తి చేయడానికి సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ మండలాల వారీగా సమీక్షించి అధికారులకు వారాంతపు లక్ష్యాలు నిర్ధేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్‌లు, హౌసింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 తయారీకి
## అన్ని విధాలా చర్యలు చేపడుతున్నాం

### జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 తయారీకి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజయవాడ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణపై చర్చించారు. సంబంధించి తొలగించబడిన ఓటర్ల జాబితా, ఇంటింటి వెరిఫికేషన్, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లా కలెక్టర్లు, డిఈఓ లతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్‌తో పాటు, తిరుపతి ఈ ఆర్‌ఓ హరిత, ఈఆర్‌ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. 2022 జనవరి 6 నుంచి తొలగింపు ఓటర్ల జాబితా రీ వెరిఫికేషన్ మేరకు చనిపోయిన వారు 38337, పిఎస్ఈ, డిఎస్ఈలు 54220, వేరే ప్రాంతానికి వెళ్లిన వారు 17894 వెరసి మొత్తం 110451గా ఉందని, నిబంధనలు మేరకు చర్యలు చేపట్టామని అన్నారు. పొలిటికల్ పార్టీల నుండి ఫిర్యాదులు 52327 అందగా వెరిఫికేషన్ పూర్తి అయిందని, అందులోని ఓటర్ల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. అందులో 13797 మంది చనిపోయిన వారు, డబుల్ ఎంట్రీలు 2023, పర్మనెంట్ షిఫ్ట్ అయినవారు 6890 ఉన్నారని అన్నారు. ఈ నెల 15 నాటికి పూర్తి చేస్తామని అన్నారు. అలాగే జిల్లాలో 15 ఎప్రిల్ 23 నాటికి ఫారమ్ 6, ఫారం 7, ఫారం 8 కింద అందిన క్లైమ్‌లు, అభ్యంతరాలు వివిధ స్థాయిలలో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇంటింటి సర్వేలో 1732797 మంది ఓటర్లకు గాను 26719 మంది ఓటరుగా నమోదు కాని వారిగా గుర్తించి ఓటరుగా నమోదు కాని వారిగా గుర్తించి ఓటరు నమోదుకు చర్యలు చేపడుతున్నామని, అందుబాటులో హాజరు కాని ఓటర్లు 68416, డుప్లికేట్ 4360, షిఫ్టెడ్ 33101, చనిపోయిన వారు 28182గా గుర్తించడం జరిగిందని వాటి పై తదుపరి చర్యలు చేపట్టామని అన్నారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల్ కిషోర్, ఈఆర్‌ఓలు కనక నరసా రెడ్డి, కోదండ రామిరెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని, శ్రీనివాసులు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సురేష్, సిబ్బంది పవన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## షణ్ముఖునికి షోడశాభిషేకాలు

### కిట కిట లాడిన సుబ్రమణ్యం స్వామి ఆలయాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలంలో వెలసిన చెంగల్వరాయస్వామి,తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయాలు మంగళవారం భక్తులతో కిట కిట లాడాయి. ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది,స్వామి వారికి షోడశాభిషేకాలు నిర్వహించారు. పట్టణానికి ఓ వైపు దుర్గంబా కొండ మరో వైపు సుబ్రమణ్యం స్వామి ఆలయం కుమారస్వామి తిప్పగా వెలసి భక్తుల కొంగుబంగారంగా విరాలజిల్లుతుంది.మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం,శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి,ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడశాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు, తేనే,విభూది,గంధం, కుంకుమ, పసుపు,సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు.చూపరులను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్,మురళిలు తీర్చి దిద్దుతున్నారు.

**కుమారస్వామి ఆలయాలకు పోటెత్తున్న భక్తులు:**

శ్రీకాళహస్తి పట్టణంలోనూ, ఆలయంలో పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాలున్నాయి. అయితే తేరువీధిలో ఆలయప్రధానార్చకులు స్వర్గీయ బాబు గురుకుల్స్‌కు చెందిన ఆలయం షణ్ముఖ స్వామి ఆలయం. ఇక్కడ సుబ్రమణ్యం స్వామి ఆరుముఖాలతో వెలసి దర్శనమిస్తున్నారు.ఈ ఆలయం పట్టణ నడిబొడ్డులో ఉండటంతో ఇక్కడకు పట్టణ నలు మూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. భక్తులు ప్రతి ఒక్కరు పాలను, పెరుగును అందిస్తున్నారు. వాటితో అభిషేకాలు నిర్వహిస్తున్నారు.ఇక ఇక్కడ స్వాములు నిర్వహిస్తున్న అలంకారాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.ఇక భక్తులు వచ్చిన వారికి దాన ధర్మాలు చేస్తున్నారు. ఇక్కడ వెలసిన వినాయకుడు మహిమాన్వితుడని చెబుతారు. ఉదయం సూర్యోదయం నుంచి రాత్రి 9గంటల వరకు ఈ ఆలయంలో విశేష పూజలు, అలంకారాలు నిర్వహిస్తున్నారు .కాగా ఆలయంలోని రంగుల గోపురం పక్కనే వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి ఆలయాల్లో కణితలు వచ్చిన వారు స్వామికి బెల్లం ముద్దలను నైవేద్యంగా పెట్టి పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరణిలో వేస్తున్నారు. కొన్ని వారాలకు వారికి నయం అవుతుందనే నమ్మకం ఉంది.

వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తాం
వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర
అలిపిరి కాలిబాట మార్గాన్ని పరిశీలించనున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్
4లో

# గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్‌చే ఉపాధి పనుల పరిశీలన

ఐరాల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమీషనర్ ఏ.సూర్యకుమారి మంగళవారం పరిశీలించారు. కమీషనర్ జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని వడ్రాంపల్లె గ్రామ పంచాయతీ మిట్టయిండ్లు గ్రామం వద్ద సుమారు 4.40 లక్షల రూపాయల వ్యయ అంచనాలతో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన అమృత్ సరోవర్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అమృత్ సరోవర్ కింద చేపట్టిన కుంట లోతు నీటి నిల్ల సామర్థ్యాన్ని పెంచి చేపల పెంపకం, బండ్ ప్లాంటేషన్



కింద కొబ్బరిమొక్కలు పెంచి ఆర్తిక వనరులను పెంచుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి స్థానిక దాతల సహకారంతో అమృథ్ సరోవర్‌లో భాగంగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన మొక్కల పెంపకాన్ని పరిశీలించి సర ్పంచ్‌ను కమీషనర్ అభినందించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కమీషనర్ శివప్రసాద్, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు గంగా భవాని, తులసి, డీఎల్‌డీఓ రవికుమార్, ఎంపీడీఓ నాగరాజు,సంభందించి శాఖల అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పం చెరువు ఫెన్సింగ్‌కు 15.50లక్షలు మంజూరు

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్పంరూరల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

కుప్పం పాతపేట వద్దగల కుప్పం చెరువు అభివృద్ధి, చెరువు చుట్టూ ఫెన్సింగ్ పనులకు రూ 15.50లక్షల నిధులు మంజూరైనట్లు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ సూచనల మేరకు చెరువు ఫెన్సింగ్ విషయంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా జిల్లా కలెక్టర్ స్పందించి రూ 15.50లక్షల నిధులను కలెక్టర్ ఫండ్ కింద మంజూరు చేశారన్నారు. దీనిపై కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈమేరకు మంగళవారం ఇరిగేషన్ డిఇఇ హరినాథ్‌రెడ్డి, కౌన్సిలర్ సయ్యద్‌అలీతో కలసి చెరువు పరిశీలించారు. కార్యక్రమంలో ఆ ంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, మురుగన్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేక ఉత్సవాలు

గుడుపల్లె, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



మండలంలోని మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం వేదబ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్య శాస్త్రి అధ్వర్యంలో గోపుర కలశ ప్రతిష్ట, పీఠ పూజ, యంత్రప్రతిష్ట, హోమాలు, అష్టావధాన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమె ్మల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.సర్పంచ్ అమరనాథ్, జడ్పీటిసి కృష్ణమూర్తి, కో కన్వీనర్ రామూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి పెద్దిరెడ్డి కుప్పం పర్యటన

కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం కుప్పంలో పర్యటి ంచనున్నట్లు ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ తెలిపారు. గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేక మహోత్సవంలో మంత్రి పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు మంత్రి పర్యటన జయప్రదం చేయాలని కోరారు.

## చంద్రబాబు కోసం మైనార్టీ నేతల ప్రత్యేక ప్రార్థనలు

కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని, ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ మైనార్టీ నేతలు మంగ ళవారం ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేపట్టా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్ట్ అక్రమమని వైకాపా ప్రభుత్వం చంద్రబాబుపై కక్షసాధిం పుకు దిగిందని పేర్కొన్నారు. మైనార్టీలు చంద్రబాబువైపే ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు హాజీ సర్దార్ బాషా, హాజీ అన్సర్ బాషా, హాజీ ముజీబ్, ఉమ్మర్, రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గీతకు డాక్టరేట్ ప్రదానం



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీ తెలుగుశాఖలో పరిశోధన చేస్తున్న కె. గీతకు పిహెచ్‌డి పట్టా ప్రదానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా॥ నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ యూనివర్సిటీ తెలుగు విభాగంఅసోసియేట్ ప్రొఫెసర్ డా॥ భూక్య తిరుపతి పర్యవేక్షణలో రాయలసీమ కథలు – ప్రాంతీయ జీవిత చిత్రణ (1991–2000)అన్న అంశంపై గీత సమర్పించిన పరిశోధక గ్రంథానికి గాను డాక్టరేట్ అందించినట్లు తెలిపారు. వర్సిటీ తెలుగు విభాగం అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు గీతను అభినందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జాతీయస్థాయి కబడ్డీ, యోగా పోటీలకు సుబ్రమణం ఎంపిక

ఐరాల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:




జాతీయస్థాయి కబడ్డీ, యోగా పోటీలకు ఐరాల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కోమల తెలిపారు. ఇటీవల విజ యవాడలో జరిగిన సివిల్ సర్వీస్ రాష్ట్రస్థా యి పోటీల్లో ఐరాల జడ్పీ ఉన్నత పాఠ శాల బయాలజి అసిస్టెంట్ సుబ్రమణ్యం కబడండీ, యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయుడు సుబ్రమణ్యంను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలకు, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల పీఎంసీ ఛైర్మన్ రవీంద్రారెడ్డి, పీడీ దేవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నెలాఖరులోపు రైతులు ఈకెవైసి పూర్తి

పాలసముద్రం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

రైతు భరోసా పోర్టల్ ఓపెన్ కావడంతో అర్హులైన రైతులు ఈ నెలాఖరులోపు ఈకెవైసి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ పేర్కొన్నారు. రైతు భరోసా నగదు జమ కాని రైతులు, కొత్త పాసు పుస్తకాలు కల్గిన రైతులు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం తీసుకొని రైతు భరోసా కేంద్రంకు వెళ్ళి ఈకెవైసి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## పోలీసులకు చుక్కెదురు

– 'దేశం' నాయకులకు రిమాండ్‌ను తిరస్కరించిన కోర్టు

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:



చిత్తూరు టుటౌన్ పోలీసులకు మంగళ వారం చిత్తూరు 4వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో చుక్కెదురైంది. తెలుగుదేశం పార్టీ సోమ వారం ఇచ్చిన బంద్ సందర్భంగా జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, గోకుల్ ఆదిత్య, సల్మాన్‌లు చిత్తూరు– పలమనేరు రహదారిలో వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సుపై రాళ్ళు రువ్వి అద్దాలు ధ్వంసం చేశారు. ఈ మేరకు టుటుటౌన్ పోలీసులు సోమవారం వీరిని అరెస్టు చేశారు. ఈ ముగ్గురిని మంగళవారం పోలీసులు 4వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచి రిమాండ్ విధించాలని కోరారు. అయితే న్యాయమూర్తి షేక్ బావజాన్ వీరి రిమాండ్‌ను తిరస్కరించారు. వీరికి 41 నోటీసులు జారీ చేసి విడుదల చేయాలని ఆదేశించారు. కాగా టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో కాజూరు రాజేష్‌ను మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా దేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, నాయకులు జి.శంకర్ తదితరులు పరామర్శించారు.

## నెలాఖరులోపు రైతులు ఈకెవైసి పూర్తి

పాలసముద్రం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

రైతు భరోసా పోర్టల్ ఓపెన్ కావడంతో అర్హులైన రైతులు ఈ నెలాఖరులోపు ఈకెవైసి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ పేర్కొన్నారు. రైతు భరోసా నగదు జమ కాని రైతులు, కొత్త పాసు పుస్తకాలు కల్గిన రైతులు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం తీసుకొని రైతు భరోసా కేంద్రంకు వెళ్ళి ఈకెవైసి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# కొత్తూరు ఎస్టీకాలనీ పాఠశాల ఆక్రమణలను తొలగించాలి

-మండల మీట్‌లో ఎంపీపీ మోహన్

ఐరాల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

మండలంలోని కొత్తూరు ఎస్టీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆక్రమణలను వెంటనే తొలగించాలని మండల ఎంపీపీ చింతం మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కారా ్యలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరు ఎస్టీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకుంటున్నారని తెలిపారు.ఈఆక్రమణలను వెంటనేత తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీనితో రెవెన్యూ అధికారులచే సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ దామోదర్‌నాయుడు తెలిపారు. అలాగే



కాణిపాకం దేవస్థానంలో జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్స వాలకు

మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఆనవాయితీగా పంపే ఆహ్ ్వానాలు ఈఏడాది పంపలేదని ఎంపీటీసీ లోకేశ్వరి అన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన కరెంట్ స్థంభాలను ఇంతవరకు అందించలేదని నాంపల్లె సర్పంచ్ తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని ఆయా శాఖలకు సంభందించిన ప్రగతిని సంభందిత అధికారులు వివరించారు. ఈసమావేశంలో ఎంపీడీఓ నాగరాజు, తహసీల్దార్ సుశీల, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నాడు నేడు పనులు వేగవంతం చేయండి

కోట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



రెండో దశ నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్లను, ప్రధానోపాధ్యాయులను ఎంఇఓ మస్తానయ్య కోరారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులతో, అసిస్టెంట్ ఇంజనీర్లతో నాడు నేడుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మస్తానయ్య మాట్లాడుతూ రెండోదశ నాడు నేడు పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతం చేయాలన్నారు. అవసరమైన పాఠశాలలకు కంపోనెంట్ పనులను ఇంజనీర్లతో ఎంఇఓలు సమన్వయం చేసుకొని పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## పీడీ మల్లికార్జునరెడ్డికి సబ్ లెఫ్టినెంట్ హోదా

కోట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్ లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డిని సబ్ లెఫ్టినెంట్ హోదా సాధించినందుకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు. మంగళవారం ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్‌సిసి ఆర్మీ, నావెల్ వింగ్స్ ఉన్నాయన్నారు. 10 ఆంధ్రా నావెల్, ఎన్‌సిసి యూనిట్ విభాగంలో ఈ హోదా దక్కిందని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి, నాగాపూర్‌లో 90 రోజుల పాటు కటోరమైన శిక్షణ తీసుకొని మల్లికార్జునరెడ్డి లెఫ్టినెంట్ హోదా పొందారన్నారు. కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి కాలానుగుణంగా కళాశాలకు అన్ని రకాల వసతులు సమకూరుస్తున్న వనరుల కారణంగానే ఇలాంటి సాధ్యమవుతున్నాయని చెప్పారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు

కోట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

సెప్టెంబర్ 14, 16 తేదీలలో ఎన్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఇఓ శైలజ, ఎంఇఓ–2 మస్తానయ్య తెలిపారు. మంగళవారం వారు కోటలో మాట్లాడుతూ ఈ పోటీలు ఎవికెఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. 14వ తేదీన బాలికలకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్, టెన్నీ కాయిట్, యోగా, అథ్లెటెక్స్, 16వ తేదీన బాలురకు మిగిలిన క్రీడాంశాలు జరుగుతాయని మండల కోఆర్డినేటర్, వ్యాయామ ఉపాధ్యాయులు వలీ అహ్మద్ తెలిపారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని సమన్వయకర్త వలీఅహ్మద్ చెప్పారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సురేంద్రబాబు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోర్నా వెంకటనారాయణ ముదిరాజ్

నాయుడుపేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

రాష్ట్రంలో మదిరాజ్‌ల సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కోర్నా వెంకట నారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం నాయుడుపేటలోని ముదిరాజ్ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో కంటే ప్రస్తుతం 15 నుంచి 20 లక్షలకు పైగా ముదిరాజ్‌లు ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలోనే ముదిరాజ్‌లు అందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం దిశగా పయనిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ముదిరాజ్‌లకు సంబంధించి కమ్యూనిటీ హాల్‌లు ఏర్పాటుకు స్థలం, భవన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి వైఎస్



జగన్‌మోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, మంత్రులను కలిసి ఉన్నామని తెలిపారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట నియోజకవర్గంలో కూడా ముదిరాజ్‌లు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారని తెలిపారు. నాయుడుపేటలో కూడా ముదిరాజ్ సంక్షేమ సంఘానికి సంబంధించి కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను కలిసి వినతిపత్రం అందించామని తెలిపారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లకు ప్రాముఖ్యత ఇచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలో కూడా తమ వర్గానికి చెందిన విడదల రజనికిమంత్రి పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పెళ్లకూరు మండలవ ఐసీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గునిశెట్టి గోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

తడ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

తడలో బుధవారం నుంచి మూడురోజుల పాటు మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలియజేశారు. తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పోటీలలో మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ వంటి పోటీలలో పాల్గొనాలని ఎంఇఓ–1 సరస్వతి, ఎంఇఓ–2 మల్లికార్జునరావులు పేర్కొన్నారు.

## కోర్టులో ఉన్న భూముల ఆక్రమణపై వినతి

చిల్లకూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



మండలంలోని కడివేడు గ్రామ రెవెన్యూలో సర్వే నెంబర్ 741 నుండి 800 వరకు కొంత భూమిని కమ్మవారిపాల్యెం గ్రామస్తులు సాగు చేసుకుంటూ వారి ఆధీనంలో ఉంది. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి ఆ ఇబ్బందులపై కోర్టులో కేసు నడుస్తుండగా గూడూరుకు చెందిన కొందరు వ్యక్తులు రాజకీయ అండతో యంత్రాలు సహాయంతో ఆదివారం కంపచెట్లు తీసే ప్రయత్నం చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు యంత్రాలు అడ్డుకున్నారు. అయితే మంగళవారం ఆ భూములకు సంబంధించి హక్కు పత్రాలను కమ్మావారిపాల్యెం గ్రామస్తులు చిల్లకూరు తహశీల్దార్ కె. శ్రీనివాసులకు అర్జీ రూపంలో వినతి పత్రం అందజేసారు. దీనిపై వెంటనే స్పందించిన తహశీల్దార్ ఆర్ఐ, విఆర్ఓ ఈ భూములు కోర్టు పరిధిలోఉందని ఆ భూముల్లోకి ఆక్రమణ దారులు ప్రవేశించరాదని వారు తెలిపారు. రీ సర్వే చేసిన తర్వాత పూర్తి సమాచారంతో సమస్యలను పరిష్కరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కమ్మవారిపాల్యెం గ్రామ సర్పంచ్, రైతు భరోసా అడ్వైజర్ కమిటీ సభ్యులు చిట్టేటి నారాయణ, జొక్కం రెడ్డి చంద్రారెడ్డి, పచ్చా వెంకటేశులు నాయుడు, మరికొంత మంది రైతులు పాల్గొన్నారు.

## మల్లానూరులో కళ్లకు గంతలతో దేశం నేతల నిరసన

కుప్పంరూరల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని మల్లానూరులో తెదేపా నేతలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ దారుణమన్నారు. వైకాపా ప్రభుత్వం చంద్రబాబుపై కక్షతోనే ఇలా వ్యవహరిస్తోందన్నారు. చంద్రబాబునాయుడు మరలా ప్రజాక్షేత్రంలో వస్తారని ప్రజలు మరింత ఆదరించి బ్రహ్మరథం పట్టధం ఖాయమన్నారు. కార్యక్రమంలో నేతలు సాంబశివం , రామచంద్ర, మహేంద్ర, చెక్కునత్తం మణి, రాజగోపాల్, సుబ్బు, శివకుమార్, అన్నాదొరై, వసంతమ్మ, స్వాతితో పాటు పలువురు పాల్గొన్నారు.

## 14న షార్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ కౌన్సిల్ సమావేశం

శ్రీహరికోట (తడ), సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

ఈ నెల 14న శ్రీహరికోటలోని షార్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సాంబశివయ్య తెలిపారు. శ్రీహరికోటలోని కల్పన అతిథి గృహంలో జరిగే కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సొసైటీ నిర్వాహకులు కోరారు.

## తుంబూరులో గుండెపోటుతో టిడిపి కార్యకర్త మృతి

నారాయణవనం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :

మండలంలోని తుంబూరు గ్రామానికి చెందిన మునివేలు అనే టిడిపి కార్యకర్త గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల తెలుగుదేశ ం పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడుని అరెస్టు చేయడాన్ని టివిలో చూస్తు మునివేలుకు చాతిలో నొప్పిరావడంతో ఆయన్ని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి సత్యవేడు టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ హెచ్ హెలెన హేమలత ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మృతుడు మునివేలును కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఆమెతో పాటు మండల క్లస్టర్ ఇంచార్జ్ పి గిరిబాబు, యూనిట ఇంచార్జ్ బిట్ర బాలసుబ్రమణ్యం, పంచాయతీ అధ్యక్షులు సుబ్రమణ్యం, అసెంబ్లీ రైతు విభాగం ఉపాధ్యక్షులు మోహన్‌రాజు, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లాపురి, నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## నేడు గంగమ్మ జాతర ఘనంగా ఏర్పాట్లు

నగరి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:



నగరి పట్టణానికి చెందిన జాతరకు ఎంతో ప్రాతినిధ్యం ఉంది. మంగళవారం ఉదయం నుంచే గంగమ్మ కొలువుదీరే ప్రాంతంలోను, దేశమ్మ, ఓరుగుంటాలమ్మ ఆలయాల వద్ద మహిళలు భారీ సంఖ్యలో పొంగళ్లు పెట్టారు. ఇప్పటికే గంగమ్మ దర్శనానికి భక్తుల రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతర మొక్కుబడుల్లో ప్రధానమైన వెయ్యి కన్నుల దుత్త, అగ్గిసట్టి విక్రయాలు ఊపందుకున్నాయి. వేపాకు సారెను సమర్పించేందుకు యువకులు వేపాకు రెమ్మల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రధాన రహదారి పొడవునా విద్యుత్ దీపాలంకరణలను ఆకట్టుకునే భారీ రంగుల రాట్నాలు ఏర్పాటయ్యాయి. జాతరను పురస్కరించుకుని టీటీడీ వారు ఈ ఏడాది ప్రప్రథమంగా ఆలయం వద్ద భారీ ఎత్తున చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పుష్పాలంకరణకు వందకేజీల పుష్పాలను టీటీడీ అందించింది. ప్రధాన మార్గాల్లోని కూడళ్ళ వద్ద మంత్రి రోజా జాతర శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఆర్చిలు జాతరకు కొత్త కళను తీసుకొచ్చింది. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు అబ్బురపరచింది.

## దళితుల భూములకు అగ్రవర్ణాలకు పట్టాలా?

పట్టాలు రద్దు చేసి న్యాయం చేయండి:



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి పరిధిలో దళితులు సాగు చేసుకుంటున్న భూములకు అగ్రవర్ణాలకు పట్టాలు ఇవ్వటం దారుణమని వాటిని రద్దు చేసి దళితులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు అంగేరి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన సారధ్యంలో శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట అక్కుర్తి గ్రామానికి చెందిన బాధితులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. వీరి దీక్షకు సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పుల్లయ్యమాట్లాడుతూ అక్కుర్తి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 73,382లలో సుమారు 9 ఎకరాల దరఖాస్తు భూమిని ఆ గ్రామానికే చెందిన పది దళిత కుటుంబాల వారు 40 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్నారని వివరించారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కాళ్ళరిగేలా రెవెన్యూ కార్యాలయం వద్ద అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే పట్టించుకోలేదన్నారు. అయితే ఆ భూములకు ఎలాంటి సంబంధం లేని అగ్రకులస్థులకు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా పట్టాలు జారి చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. జిల్లా కలెక్టర్ స్పందించి అగ్రకులస్థులకు జారి చేసిన అక్రమపట్టాలను రద్దు చేసి దళితులకిచ్చిన భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేసారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, వేలింవేంద్రం, అక్కుర్తి దళితులు పాల్గొన్నారు.

## కాసరం పాత దళితవాడలో నీటి సమస్య పరిష్కారం



తొట్టంబేడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని కాసరం పాత హరిజనవాడలో గత పదిరోజులుగా నెలకొన్న దాహార్తిని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధనా కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి తీర్చారు. కాసరం పాత దళితవాడలో తాగునీటి బోరు పదిరోజుల కిందట మరమ్మత్తులుకు గురైంది. దీంతో సమస్యను సచివాలయ ఉద్యోగులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. దీంతో స్థానికుడైన భరత్‌రెడ్డికి తెలియజేయడంతో వాటర్‌ట్యాంకుల ద్వారా మంచినీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డికి తీర్చారు.

## తొట్టంబేడు మండలంలో నాభూమి-నాదేశం కార్యక్రమం



తొట్టంబేడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

రాజకీయాలకు కులమతాలకు అతీతంగా దేశభక్తిని పెంపొందించే విధంగా దేశ ప్రధాని నరేంద్రమోడీ పిలుపుతో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచనల మేరకు 'మనమట్టి-మన దేశం' అన్న దిశగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరు సంస్మరణార్థం కోసం మండలంలోని కల్లిపూడి, పొయ్యకొత్తూరు, పెద్దకన్నలి గ్రామాల్లో నుంచి దేశభక్తితో మట్టిసేకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ఆచార సంప్రదాయాల ప్రకారం దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వీరుల సంస్మరణార్థం డిల్లీలో అమృతవాటిక నిర్మాణం కోసం మట్టిని సేకరిస్తున్నామన్నారు. మనభూమి మనదేశం భారత్‌మాతాకీ జై అన్న నినాదాలతో బిజెపి నేతలు ప్రతి ఇంటికి వెళ్లి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు నియోజకవర్గ పార్టీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వేడాంకృష్ణయ్య, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి కందాటిసుబ్బరామిరెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి పెద్దపాళెం రవి ఆచారి, దళిత మోర్చా నేత ఎం.వాసు, ఓబిసి మోర్చా మండల అధ్యక్షురాలు పుచ్చకాయలరమేష్‌యాదవ్, చొక్కాని రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బడుగులే లక్ష్యంగా పోలీసులు..తెదేపా బిసి విభాగం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ పాలనకు చరమగీతం పాడాలని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు చేస్తున్న ప్రజా పోరాటంలో భాగస్వాములైన బడుగు బలహీన వర్గాల అంతమే లక్ష్యంగా పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా తెలుగుదేశంపార్టీ బిసి విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్ ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షపూరిత దోరణితో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నేడు ప్రతిపక్షనాయకుడిగా ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం అవినీతికి దూరంగా విశేష సేవలందించిన నారాచంద్రబాబునాయుడుపై అభూతకల్పనతో అక్రమ కేసులు బనాయించి వేదింపులకు గురిచేయడాన్ని బిసి విభాగం నాయకులు తీవ్రంగా ఖండించారు. గత మూడు రోజులుగా తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో జరుగుతున్న శాంతియుత నిరసన కార్యక్రమాలను అడ్డుకుంటూ నిరసన కార్యక్రమాలలో పాల్గొనే బడుగుల లక్ష్యంగా పోలీసుల చేత దాడులు చేయించడం వైసిపి కుట్రలో భాగమే అన్నారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, నాయకులు భాస్కర్, మణి, వంశీకృష్ణ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బాలికల వసతిగృహంలో మంచినీటి సమస్య పరిష్కారం

-పవిత్రారెడ్డి చొరవ



తొట్టంబేడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

మండల ఎంపిడిఓ కార్యాలయానికి పక్కనే ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహం 1,2లో ఉన్న విద్యార్థినులకు మంచినీటి సమస్య ఉందని దీన్ని వెంటనే పరిష్కరించాలని ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి కుమార్తె మండల ఇన్‌ఛార్జి బియ్యపుపవిత్రారెడ్డికి తెలియజేయడంతో యుద్ధప్రాతిపదికన విద్యార్థులకు మంచినీటి వసతికల్పించాలని కోరడంతో వెంటనే స్పందించిన పవిత్రారెడ్డి సర్పంచ్ సుబ్బయ్యకు తెలిపి వెంటనే వసతిగృహంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరడంతో సోమవారం రాత్రి ఆమె వసతిగృహాన్ని సందర్శించి బాలికలతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే కొత్తమోటార్లు ఏర్పాటుచేసి వసతిగృహంలో ఉంటున్న 100మందిపైగా విద్యార్థినుల మంచినీటి సమస్య తీర్చడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. నాడు నేడు పథకంలో కూడా వసతిగృహ మరమ్మత్తులకు ప్రతిపాదనలు పంపామని ఇంకా అనుమతి రాలేదని వార్డెన్ హేమలత పవిత్రారెడ్డికి వివరించారు. అనంతరం విద్యార్థినులు వసతిగృహ ఆవరణలో షెడ్లు వేస్తే రాత్రివేళల్లో చదువుకునేందుకు అనుకూలంగా ఉంటుందని పవిత్రారెడ్డికి చెప్పడంతో త్వరలోనే వేయిస్తానన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?లేదా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడు, సర్పంచ్ సుబ్బయ్య, రాజ్‌ప్రకాష్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సబ్‌జైలులో తెదేపా నేతలను పరామర్శించిన నరసింహయాదవ్



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి సబ్‌జైలులో ఉన్న తెలుగుదేశంపార్టీ నాయకులను తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షులు నరసింహయాదవ్‌తో సహా పలువురు టిడిపి నాయకులు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులే అక్రమకేసులు నమోదు చేస్తే రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కల్పించే నాధుడు ఎవరని ప్రశ్నించారు. పోలీలీసులు మనస్సాక్షితో పనిచేయాలని విజయమ్మ కూడా జగన్‌ను క్షమించే పరిస్థితి లేదన్నారు. సబ్‌జైలులో ఉన్న తెలుగుదేశంపార్టీ నాయకులు రెడ్డివారిగురవారెడ్డి, కాసరం రమేష్, రంగినేని చెంచయ్యానాయుడు, కాసరం రమేష్‌తదితరులను పరామర్శించారు. సబ్‌జైలు నుంచి వచ్చిన అనంతరం నరసింహయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని కక్ష సాధింపు దోరణి తగదని ప్రజలే జగన్ ప్రభుత్వానికి బుద్దిచెప్తారన్నారు. జగన్ తల్లి విజయమ్మ కూడా జగన్‌ను క్షమించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో దేశం నాయకులు రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మాజీ పాలసరఫరా ఛైర్మన్ మునిరాజనాయుడు, రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, మునిరాజయాదవ్, వజ్రంకిషోర్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని ఊరందూరు గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతిచెందారు. మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో సుమారు 50 సంవత్సరాలు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తుపట్టలేని విధంగా చిన్నాభిన్నమైంది. శ్రీకాళహస్తి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడు పచ్చరంగు నైట్‌ప్యాంటు దరించి చిన్నాభిన్నమైందని వివరించారు. తెల్లని గీతలు కలిగిన పుల్‌షర్టు ధరించి ఉన్నాడని మృతుడు ఆత్మహత్య హత్య చేసుకున్నాడా లేదా ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందాడా అని వివరాలు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించామనిమృతుని వివరాలు తెలిస్తే 9292403084 నంబర్‌ను పోన్‌చేయాలని రైల్వే పోలీసులు కోరారు.

## నాడు -నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

తిరుపతిరూరల్, సెప్టెంబర్12 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలంలో రెండో విడత నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఓ వెంకటనారాయణ అన్నారు. మన బడి నాడు-నేడు రెండో విడతపై మంగళవారం రివ్వూ సమావేశం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ నిర్ణియత సమయంలోపు నాడు-నేడు రెండో విడత పనులను పూర్తి చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పూర్తి స్థాయిలో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో తిరుపతిరూరల్ ఎంఇఓ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ, ప్రధాన ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులకు చక్కటి దిక్సూచి..బిఎన్ఐ!

-మెగా విజిటర్స్ డేలో డా॥ఏఆర్.రెడ్డి

-తిరుపతి(విద్య) సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

వ్యాపార రంగం మరింత విస్తృత స్థాయిలో ముందడుగు వేయడంతో పాటు వ్యాపారులకు చక్కటి దిక్సూచిగా నిలిచే వేదిక బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బిఎన్ఐ) అని ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణుడు డా॥ఏఆర్.రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో బిఎన్ఐ ఆధ్వర్యంలో మెగా విజిటర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వ్యాపారంలో ఏ రంగమైనా నాణ్యత, మన్నిక, నమ్మకంతో పాటు ప్రణాళికా బద్ధమైన క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. వినియోగదారుల ఆదరణ పొందినప్పుడే వ్యాపార రంగం విజయపథంలో నడుస్తుందన్నారు. నేటి ఆధునిక సమాజంలో తగిన నైపుణ్యాలు, సూచనలు, సలహాలు అందించి, వారి అభ్యున్నతికి చక్కటి మార్గదర్శిగా బిఎన్ఐ కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు మాట్లాడుతూ వ్యాపారి అనే వాడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే లక్షణం కలిగి ఉండాలని, వ్యాపార రంగంలో రాణించాలనే లక్ష్యంతో పాటు, సేవా దృక్పథంతో ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిఎన్ఐ అధ్యక్షుడు సాయికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపార రంగం అభివృద్ధితో పాటు వ్యాపారుల సంక్షేమానికి తోడ్పాటు అందించే దిశగా బిఎన్ఐ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఇందుకు అవసరమైన వేదికను అందించేందుకు బిఎన్ఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఐ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి శ్రావణ కృష్ణారెడ్డి, ఈవెంట్ కో-ఆర్డినేటర్ వంశీకృష్ణ, నగరంలోని వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోజా అవినీతి చేయలేదని కాణిపాకంలో ప్రమాణం చేయగలదా..

జనసేన కిరణ్ రాయల్



తిరుపతి (మహిళవర్సిటీ), సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

ప్రతిపక్ష పార్టీలైన తెలుగు దేశం, జనసేనలను విమర్శించడంలో ముందుండే రాష్ట్ర మంత్రి రోజా అవ్వ కుటుంబం ఆస్తులు, అవినీతితో సంపాదించలేదని కాణిపాకం ఆలయంలో రోజా ప్రమాణం చేయగలదా అని జనసేన పార్టీ తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషినిలు సవాల్ విసిరారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా ముందు జనసేన పార్టీ నాయకులు కొండా రాజామోహన్, హేమకుమార్, రాజేష్ ఆచారి, వంశీ, కిషోర్, దుర్గ, చందన తదితరులతో కలిసి జోస్యంకు సంబంధించిన వస్తువులను మీడియా ముందు ప్రదర్శించి, వైసిపి నేతల భవిష్యత్తు చెప్పారు. రోజాకు భవిష్యత్తులో చిలక జోస్యమే గతి అని హెచ్చరిస్తూ హాస్య భరితమైన చురకలు విసిరారు. టిడిపి అధినేత చంద్రబాబు పై వైసిపి పాలకులు పెట్టిన అక్రమ కేసులు, తద్వారా జైలుకు పంపిన వ్యవహారంపై మంత్రి రోజా బాణాసంచాలు పేల్చి స్వీట్లు పంచడంను తప్పుపట్టాఉ. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను నోటికొచ్చినట్లు మాట్లాడితే రాబోయే ఆరు నెలల తరువాత వైసిపి ప్యాకప్, జగన్మోహన్ రెడ్డి లాకప్, రోజాకు మేకప్ అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## క్లినికల్ సైకాలజీ ప్రయోగశాలను ప్రారంభించిన ఉపకులపతి ప్రొఫెసర్ డి. భారతి

తిరుపతి (మహిళావర్సిటీ), సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన క్లినికల్ సైకాలజీ విభాగంలో మంగళవారం కొత్తగా క్లినికల్ సైకాలజీ ప్రయోగశాలను విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డి. భారతి ప్రారంభించారు. ప్రొఫెసర్ డి. భారతి మాట్లాడుతూ ఈ ప్రయోగ శాల ద్వారా మానసిక విద్యను అందించడం, ఆరోగ్య సమస్యలు, రుగ్మతలను నిర్ధారించడంలో పరీక్షలు మూల్యాంకం అని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి రిజిస్టర్, సైకాలజీ విభాగ అధినేత ప్రొఫెసర్ ఎన్ రజిని, ప్రొపెసర్‌పి. సుజాత, సైన్స్ డీన్ ఇంకా సైకాలజీ విభాగ అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఇస్కాన్ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినీలు

తిరుపతి (మహిళవర్సిటీ), సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



తిరుపతిలోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహించిన వివిధ పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు సత్తా చాటి 11 బహుమతులు గెలుపొందారు. ఈ చర్చా గోష్టిలో మొదటి బహుమతి జి. యమున, ప్రోత్సాహక మొదటి బహుమతి ఎ. అపూర్వ, ఎస్. ఛార్మి, ప్రోత్సాహక రెండవ బహుమతి ఎ. కీర్తన, బి. తేజస్విని, తెలుగు వక్తృత్వం మొదటి బహుమతి జి. దేవిక కృష్ణ, రెండవ బహుమతి ప్రగతి, ప్రోత్సాహక మొదటి బహుమతి ఓ. మౌనిష, వ్యాసరచన పోటీలో విజేతలు మొదటి బహుమతి కె. శ్వేత, రెండవ బహుమతి టిఇ పావని, మూడవ బహుమతి యు. వెంకటవైష్ణవి, ప్రోత్సాహక మొదటి బహుమతి వి. సుస్మిత, ప్రోత్సాహక రెండవ బహుమతి స్నేహలు పొందారు. వీరందరినీ తిరుపతి ఇస్కాన్ అధ్యక్షులు రేవతి రమణ దాస్, నిత్యాముక్తాదాస్ అభినందించి రాధాకృష్ణ ప్రతిమలు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు, అందించడమైంది. వీరిని కళాశాల అధ్యక్షులు డా. సి. భువనేశ్వరి చదువుతో పాటు ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందింప చేసుకునే భగవద్గీత, భాగవత ఇతిహాసాల్లో ఉన్న సారాన్ని తెలుసుకునే ప్రక్రియలో భాగంగా పాల్గొన్నందుకు ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. విజేతల అభినందన కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకులు భవాని ప్రసాద్, డా. స్నేహలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 67వ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

తిరుపతి (క్రీడా), సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

67వ స్కూల్ గేమ్స్ నిర్వహణ కార్యక్రమంలో భాగంగా తిరుపతి మండల, నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు అండర్ 14 బాలబాలికలకు, అండర్ 17 బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదిన కోకో కబడ్డి జడ్పిహెచ్ఎస్ ఎంఆర్ పల్లిలో ఈ నెల 23వ తేది వాలీబాల్ త్రోబాల్ ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ తిరుపతి నందు ఈ నెల 29, 27వ తేది యోగ అథ్లెటిక్స్ పోటీలు ఎస్పి జెఎన్ఎం కార్పొరేషన్ హై స్కూల్ నందు జరుగుతుందని, ఈ నెల 29వ తేది బ్యాడ్మింటన్ (షటిల్) పోటీలు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు జరుగునని వయోపరిమితి 01.01.2017 తర్వాత జన్మించిన విద్యార్థులు అండర్ 17 నందు పాల్గొనుటకు అర్హులు అక్కడ మీకు మానిటరింగ్ యాప్ నందు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేయవలెనన్నారు. ప్రతి పాఠశాల నుండి మిడ్ డే మీల్స్ అక్విటెన్స్ తప్పక తీసుకుని రావలెను ఇది టోర్నమెంట్ కం సెలక్షన్ అని మాత్రమే గమనించగలరన్నారు. ఆయా క్రీడలు జరుగు ప్రదేశాలలో ఉదయం ఎనిమిది గంటలకు రిపోర్టు చేయవలెనని తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ పి. విజయ కుమారి, తిరుపతి నియోజకవర్గం గాయత్రి, మండల స్థాయి కోఆర్డినేటర్ వెంకటమునితెలియజేసారు. వివరములకుఫోన్‌నెంబర్ 9441501649, 9848173174 సంప్రదించాలన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా

గ్యారేజీ, స్టోర్ సూపర్వైజర్లతో సమావేశం

తిరుపతి రవాణా, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



తిరుమల శ్రీ వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం తిరుపతి జిల్లా రవాణా కార్యాలయంలో తిరుపతి జిల్లాలోని 11 డిపోలకు సంబంధించి గ్యారేజీ, స్టోర్ సూపర్వైజర్లతో తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు తిరుమల శ్రీ వారి బ్రహ్మోత్సవాలలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను నడపాలని తెలిపారు. ఇంకా ఘాట్ రోడ్ బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, ఎటువంటి ఆర్జీలు లేకుండా చూసుకోవాలని, బస్సులకు అవసరమైన సామాగ్రి, యూనిట్లు, స్పేర్లు, టైర్లు, టూల్స్ సిద్దంగా ఉండేలా చూసుకోవాలని, బ్రహ్మోత్సవాలలో బస్సులు ఎక్కడ ఫెయిల్యూర్ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసారు.

## డిపోలలో ఖాళీ స్థలముల టెండర్ల పై అవగాహన సదస్సు

తిరుపతి రవాణా, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



తిరుపతి ఆర్టీసి బస్టాండు పరిధిలోని వెంకటగిరి, సూళ్ళూ రుపేట బస్ డిపోల లోని ఖాళీ స్థలములను ఓఎస్ 15 స్కీము 15 సంవత్సరాల కాల వ్యవధికి వ్యాపారములు చేసుకొనుటకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్ 4 కడప వారు టెండర్ నోటీసు 31.08.2023 పిలిచి ఉన్నారని ప్రజా రవాణా శాఖ అధికారి తిమ్మాడి చంగల్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వెంకటగిరి, సూళ్ళూరుపేట ప్రాంతాల నుండి ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం. భాస్కర్, డిప్యూటీ ఈఈ (సివిల్) కె. చెన్న కేశవరావు, డిపో మేనేజర్ రాజవర్ధన్, డిపో మేనేజర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## యాచకుడు మృతి



.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఓ యాచకుడు మృతిచెందినట్లు టుటౌన్ఎస్ఐ మహేష్‌బాబు తెలిపారు. వృద్ధుని వయస్సు సుమారు 65సంవత్సరాలు ఉంటుందని అతని ఎదుటిరొమ్ముపై ఓం అన్న పచ్చ బొట్టు ఉందని మరోవైపు తమిళంలో రాయబడిన పేరు ఉందన్నారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచామని తెలిపారు. వివరాలు తెలిస్తే టుటౌన్ఎస్ఐ 9154141887 నంబర్‌కు పోన్ చేయాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## ఇస్కాన్ నిర్వహించిన వివిధ పోటీలలో

ప్రతిభ చూపిన ఎస్‌పిడబ్ల్యుజె కళాశాల విద్యార్థినిలు



-తిరుపతి(విద్య) సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

తిరుపతిలోని 'అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం' (ఇస్కాన్) నిర్వహించిన వివిధ పోటీలలో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల(ఎస్‌పిడబ్ల్యుజెసి) విద్యార్థినిలు సత్తాచాటి 11 బహుమతులు గెలుపొందడం జరిగింది. ఇందులో చర్చా గోష్టికి సంబంధించి మొదటి బహుమతి జి.యమున, మొదటి ప్రోత్సాహక బహుమతి ఎ.అపూర్వ, ఎస్.ఛార్మి, రెండవ ప్రోత్సాహక బహుమతి ఎ.కీర్తన, బి.తేజస్విని, తెలుగు వక్తృత్వ పోటీలో మొదటి బహుమతి జి.దేవిక కృష్ణ, రెండవ బహుమతి ప్రగతి, మొదటి ప్రోత్సాహక బహుమతి ఓ.మౌనిష, వ్యాసరచన పోటీలో కె.శ్వేత మొదటి బహుమతి, ఇ.పావని రెండవ బహుమతి, యు.వెంకట వైష్ణవి మూడవ బహుమతి, వి.సుస్మిత మొదటి ప్రోత్సాహక బహుమతి, స్నేహ రెండవ ప్రోత్సాహక బహుమతులు పొందారు. వీరందరినీ ఇస్కాన్ అధ్యక్షుడు రేవతి రమణదాస్, నిత్య ముక్తదాస్ అభినందించి వారి చేతుల మీదుగా రాధాకృష్ణ ప్రతిమలు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందచేశారు. . ఈ కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకురాళ్లు భవాని ప్రసాద్, డా॥స్నేహలత, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## స్విమ్స్ యూనివర్శిటీలో పలు అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నందు అడ్మిషన్స్ పొందడానికి 2వ వెబ్ కౌన్సిలింగ్ నిర్వహణ

తిరుపతి టౌన్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

స్విమ్స్ యూనివర్శిటిలో 2023 - 24వ విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కొరకు బిఎస్‌సి (నర్సింగ్), బ్యాచ్లర్ ఆఫ్ ఫిజియోథెరఫి (బిపిటి), బిఎస్‌సి (పారామెడికల్) కోర్సుల నందు ప్రవేశం కొరకు 2వ వెబ్ కౌన్సిలింగ్‌ను నిర్వహించనున్నారని స్విమ్స్ రిజిస్ట్రార్ తెలియజేస్తున్నారు. అడ్మిషన్ పొందగోరు విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, వెబ్ కోర్సుల యొక్క వివరాలు, సీట్ల సంఖ్య, ఫీజు వివరాలు, ఎంపిక విధానం, ఇతర వివరాల కొరకై స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించండని తెలిపారు.

## రైలు కింద ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

రేణిగుంట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:



రేణిగుంట ఏర్పేడు రైల్వే మార్గంలో సుమారు 50 సంవత్సరాలు వ్యక్తి రైలు కింద ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. రైల్వేపోలీసుల కథనం మేరకు... సుమారు 50 సంవత్సరాల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందిందన్నారు. తక్షణం సంఘటన స్థలం చేరుకున్న రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. మృతుని వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఇక దర్యాప్తులో మృతుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. రేణిగుంట రైల్వే ఎస్ఐ అనిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

నగరి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:

ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు గాను అండర్-17 బాల బాలికల ఎంపిక ఈ నెల 14వ తేదీ చిత్తూరు జిల్లా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, అండర్-14 బాల బాలికలకు ఈ నెల 15వ తేదీ తిరుపతి జిల్లా వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోను జరుగుతుందన్నారు. ఎంపిక పోటీలకు విచ్చేసే క్రీడాకారులు ఎలిజిబుల్ ఫామ్స్, మిడ్‌డే మీల్స్ అక్విటెన్స్ ఫామ్స్, స్టడీ అండ్ కాండక్ట్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. దీంతోపాటు కోచ్ కమ్ మేనేజర్లు ప్లేయర్ ఎంట్రీఫామ్‌ను, ఎంట్రీ ఫామ్ ఫర్ మండల లెవెల్ ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లను సమర్పించవలసి ఉంటుందన్నారు. తిరుపతి జిల్లాకు సంబంధించిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విజయకుమారి 9849313062, ఎస్.బాబు 9490620292, అన్నమయ్య జిల్లాకు సంబంధించిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత 9010534918 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## మంత్రి రోజాది శునకానందం

వడమాలపేట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:

మచ్చలేని నాయకుడిని కూడా జైలుకి పంపించామని టపాసులు పేల్చి, స్వీట్లు పంచి మంత్రి రోజా శునకానందం పొందుతున్నదని తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న విమర్శించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 40 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయ అనుభవం 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా కీర్తి పొందిన చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులో జైలుకి పంపించి అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు సంబరాలు చేసుకుంటున్నారని ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు రాజకీయ భిక్ష పెడితే ఎదిగిన వారు సంబరాలు చేసుకుంటున్నారంటే మానవత్వం ఉందా అని ప్రశ్నించారు. అక్రమ ఆస్తుల కేసులో మీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి బెయిల్‌పై ఉన్నారని మరచిపోయారా అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చెప్పట్టి చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం కాయమని మీ నాయకుడు మళ్లీ జైలు కెళ్ళడం కాయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. నగరి నియోజకవర్గంలో నాలుగేళ్ళలో ఎన్ని వందల కోట్లు దోచుకున్నారు. దోచుకుంటున్నావోఅన్నిఆధారాలతో నిరూపించి జైలుకి పంపించే రోజు తొందరలోనే వస్తుందని హెచ్చరించారు.

## పుత్తూరు ఈవోపీఆర్‌డీగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ

పుత్తూరురూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:

పుత్తూరు ఈవోపీఆర్‌డీగా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి గ్రామీణ మండలం తనపల్లి పంచాయతీ గ్రేడ్-1 అధికారిగా పని చేస్తూ ఈవోపీఆర్‌డీగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయనను పుత్తూరు ఈవోపీఆర్‌డీగా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, సిబ్బంది సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

## నాడు-నేడు పనులు త్వరిగతిన పూర్తి చేయాలి - ఎంఈవో

పుత్తూరురూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:



నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో తిరుమలరాజు పేర్కొన్నారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 38 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, రెండు జూనియర్ కళాశాలలు, 10 అంగన్‌వాడీ పాఠశాలలకు నాడు-నేడు కింద రూ.15 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. కొన్ని పాఠశాలలకు నిధులు చాలక పనులు ఆపేశారన్నారు. మరికొన్ని పాఠశాలల్లో నిధులు మిగిలినట్లు తెలిపారు. నిధులు మిగిలిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంటనే వాటికి సంబంధించిన వివరాలు తెలియజేసి పక్క పాఠశాలలకు ఆ నిధులను మళ్లించాలని జిల్లా కలెక్టర్, డీఈవో సమీక్ష సమావేశంలో ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:



వైసీపీ ప్రభుత్వంలోనే అర్హులందరికి పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని పుత్తూరు మండలం రామసముద్రం సర్పంచ్ కుమార్ అన్నారు. మంగళవారం రామసముద్రం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామసముద్రం పంచాయతీలోని అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అవుతున్నాయని, అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రధానంగా పంచాయతీలో పాసింజ నిర్వహణ తాగునీటిసరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, వైసీపీ నాయకులు రాజా, గ్రామస్థులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్లగంగమ్మ తల్లి వెండికవచానికి రూ.25వేలు విరాళం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



పట్టణంలోని బహదూరుపేట తెట్టు వద్ద వెలసి ఉన్న నల్లగంగమ్మ తల్లికి వెండి కవచానికి రూ. 25,116లు బహదూరుపేట వాస్తవ్యులు, సామాను చంద్రశేఖర్‌రెడ్డిలు విరాళంగా ఆలయ ఛైర్మన్ కంఠా రమేష్‌కు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు విరాళం అందజేసిన దాతలకు తీర్థప్రసాదాలను అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనిల్, యాదగిరి, మాధవ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడేలా ఖర్చు

- సకాలంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తి
- నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్


సమావేశం నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ కమీషనర్

చిత్తూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంత ప్రజల స్థితిగతులను మార్చడానికి జాతీయ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం చేపట్టడం జరిగిందని, ఈ పథకంలో ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా ఖర్చు చేయాల్సిన బాధ్యత అధికారులపై వుందని పంచాయతీరాజ్, గ్రామీణ భివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులపై రీజినల్ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఉద్యాన పంటల పెంపకంలో భాగంగా 7,328 ఎకరాల్లో పంట సాగుకు పరిపాలనా అనుమతులు మంజూరైతే 5,094 ఎకరాల్లో పంట సాగు చేశారని, దీనిని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పంట భూమి, భూసారం, నీటి లభ్యతను అనుసరించి పంటలను సాగు చేయాలని, మార్కెటింగ్ శాఖ సహకారంతో రైతులు పండును మార్కెటింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ నిర్మాణాలకు సంబంధించి 280 పనులు మంజూరైతే 144 పనులు వివిధ దశల్లో వున్నాయని, అన్ని పనులను అక్టోబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అలాగే ఉద్యాన పంటల సాగులో గుడిపాల, గుడుపల్లి, రామకుప్పం మండలాల్లో పనితీరు బాగుందని, మిగిలిన మండలాల్లో సైతం పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే మస్టర్ వెరిఫికేషన్‌కు సంబంధించి జిల్లాలో బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి మండలాల్లో వేగవంతం చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించాలని ఆమె ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉపాధి హామీ డైరెక్టర్ చిన్న తాతయ్య, వాటర్‌షెడ్ డైరెక్టర్ పివిఆర్ఎం రెడ్డి, జాయింట్ కమిషనర్ శివప్రసాద్, విజిలెన్స్ డిప్యూటీ కమీషనర్ మల్లికార్జునరెడ్డి, సోషల్ ఆడిట్ డైరెక్టర్ జగదీష్, చిత్తూరు జిల్లా డ్వామా పిడి గంగాభవానీ, అన్నమయ్య జిల్లా డ్వామా పిడి మద్దిలేటి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ ఎపిడిలు, ఎపిఓలు, విసిలులు పాల్గొన్నారు.

## రేపు అలిపిరి కాలిబాట మార్గాన్ని పరిశీలించనున్న : అప్పారావు



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : ఈ నెల 14వ తేది గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, త్రిపర్ణ ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతులు తిరుమల అలిపిరి కాలిబాట మార్గాన్ని పరిశీలించనున్నారు. జూన్ 23న చిరుత భారిన పడి కౌశిక్ అనే బాలుడు గాయాలు అయ్యాయని, మళ్లీ ఆగస్టు 12వ తేదిన లక్షిత అనే చిన్నారి చిరుత పులి దాడికి బలై ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో బాలల హక్కుల కమిషన్ వారు తిరుమలకు వెళ్లి అలిపిరి మార్గం ద్వారా సంఘటన జరిగిన ప్రాంతాలను సందర్శించి, పరిశీలన చేసి ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా తదుపరి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, చర్యలు సిఫార్సులను చేయటం జరుగుతుందని తెలిపారు. తిరుమల చేరుకున్నాక దేవదాయ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు, పోలీసు నిఘా విభాగంతో సంఘటనలు పై ఆరా తీసి చర్చించడం జరుగుతుందని తెలిపారు. తరువాత తిరుమలలో బాల్య వివాహాలు జరగకుండా చేపడుతున్న చర్యలును పరిశీలించడం, బిక్షాటన, బాలకార్మికులు నివారణ కోసం చేపడుతున్న చర్యలు గురించి చర్చిస్తున్నట్లు తెలిపారు. తిరుమలలో నిర్వహించబడుచున్న వేద పండిత పాఠశాలను సందర్శిస్తారు.

## కుప్పంలో ఎమ్మెల్సీ సహా 34మందిపై కేసు నమోదు

**- నలుగురికి 14 రోజుల రిమాండ్.. జాబితాలో తెదేపా.. జనసేన నేతలు !!**

కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అరెస్టుకు సంబంధించి కుప్పంలో సోమవారం చేపట్టిన బంద్ సందర్భంగా పోలు చేసుకున్న సంఘటనల్లో ఎమ్మెల్సీ, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో సహా తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 34మందిపై కుప్పం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఆర్టీసీ బస్సులు, అద్దాలు ధ్వంసం చేశారని డిపో మేనేజర్ వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిసిపి సెక్షన్ 341,427రెడ్‌విత్ 34, 3పిడిపిపిఎ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. కేసు నమోదైన వారిలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, తెదేపా నేతలు చలపతి, సత్యేంద్రశేఖర్, జాకీర్, డబ్బావాలు, సోమ శేఖర్, జీమ్‌దాము, సురేష్, రవి, అప్పు, సుజిత్, రవి, ఆర్‌ఆర్ రవి, బిఎంకె రవిచంద్ర, నరేష్, సతీష్, మురుగేష్, సుబ్బు, మునెప్ప, మురళి, సంతోష్, జనసేన నేతలు నరేష్, ఆమీర్, పాండు, ధనరాజ్, శ్రీధర్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా మల్లానూరులో ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేసినందుకు తెదేపా నేతలు సంజీవరాజు, చంద్రశేఖర్, పళని, జయప్రకాష్, సురేష్, శంకర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదైంది. కాగా ఇప్పటికే ఈ కేసులకు సంబంధించి తెదేపా నేతలు సత్యేంద్రశేఖర్, బాలు, నరేష్,మురళిలను పోలీసులు అదుపులో తీసుకుని న్యాయమూర్తి ఎదుట మంగళవారం రాత్రి పోలీసులు హాజరు పరిచారు. వీరికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

**ప్రపంచ ఫిజియోథెరఫి డే సందర్భంగా...**

## స్విమ్స్ వైద్యురాలు డాక్టర్ సి. శాంతికి అవార్డు



తిరుపతి టౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ ఫిజియో థెరపీ కళాశాల లో 23 సంవత్సరాలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సి. శాంతి ఫిజియోథెరపీ విభాగానికి అందిస్తున్న సేవలను గుర్తించి పుత్తూరు ఫిజియోథెరపీ కళాశాల వారు ప్రపంచ ఫిజియోథెరఫీ డే సందర్భంగా శాంతికి అవార్డును అందజేసి దుశాలువతో సత్కరించారు. డాక్టర్ సి. శాంతి ఇన్ప్లమెంటరీ ఆర్థరైటిస్ గురించి విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్థరైటిస్ బాధాకరమైన వాపు, కీళ్ల దృఢత్వంగా నిర్వహించబడింది. ఆర్థరైటిస్‌ను స్థూలంగా రెండు వర్గాలుగా వర్గీకరించవచ్చు అన్నారు. అవి ఇన్ఫ్లమేటరీ ఆర్థరైటిస్, నాన్ ఇన్ఫ్లమేటరీ ఆర్థరైటిస్, రోగిలో ఆర్థరైటిస్ ఇన్‌ఫ్లమేటరీ లేదా నాన్ ఇన్‌ఫ్లమేటరీ అని వేరు చేయడం రోగిని మరింత రోగనిర్ధారణ చేయడానికి, నిర్వహించడానికి కీలకమైన మొదటి అడుగు, ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్ సాధారణంగా వాపు యొక్క క్లాసిక్ లక్షణాలతో సంబంధం కలిగి ఉంటుంది. డోలర్ (నొప్పి), రూబర్ (ఎరిథెమా), కెలోర్ (వెచ్చదనం), కణితి (వాపు), ఫంక్టియో లేసా (పనితీరు కోల్పోవడం), అయితే అన్ని లక్షణాలు ఎల్లప్పుడూ ఉండకపోవచ్చు. ఇన్ఫ్లమేటరీ ఆర్థరైటిస్ అనేది ఇన్ఫెక్షియస్, నాన్ ఇన్ఫెక్షన్‌తో సహా అనేక కారణాల వల్ల కావచ్చు, ఇన్ఫ్లమేటరీ ఆర్థరైటిస్‌కు కారణమయ్యే అంతర్లీన పరిస్థితి యొక్క దైహిక లక్షణాలతో సంబంధం కలిగి ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు చికిత్స చేయకుండా వదిలేస్తే, ఇన్ఫ్లమేటరీ ఆర్థరైటిస్ స్థిరంగా కీళ్ల నష్టం, వైకల్యాలకు దారితీస్తుందని తెలిపారు. స్విమ్స్ వైద్యురాలు డాక్టర్ శాంతికి అవార్డు వచ్చినందుకు స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, కళాశాల అధ్యాపకులు సిబ్బంది తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఫిజియోథెరపీ కళాశాల కరస్పాండెంట్ రాకేష్ కిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సాగర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ బీమా క్లైమ్‌లు సెటిల్ అయ్యేలా చర్యలు చేపట్టండి : జేసి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : వైఎస్ఆర్ బీమా క్లైమ్ దరఖాస్తుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి క్లైమ్‌లు సెటిల్ అయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో వైఎస్ఆర్ బీమా పథకం క్లైమ్స్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎపిఎంలు అందరు పెండింగ్‌లో ఉన్న వైఎస్ఆర్ బీమా క్లైమ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వైఎస్ఆర్ బీమా క్లైమ్ సంబంధించి వ్యక్తి ఏ కారనం వల్ల చనిపోయారు అనే ఎఫ్ఐఆర్, ఫోరెన్సిక్ రిపోర్టుల పై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టి బాధితులకు భీమా పరిహారం అందేలా చూడాలని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు మరణించిన వ్యక్తి కుటుంబానికి కర్మక్రియల ఖర్చులునిమిత్తం ముందుగానే వారికి 10 వేల రూపాయిలు అందచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి జ్యోతి, డిఎల్‌డిఓలు ఆదిశేషరెడ్డి, వాణి, సుశీలా దేవి, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కృష్ణారెడ్డి, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ పార్థసారథి, డీఎస్పి నర్సప్ప, ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారి రాజశేఖర్, డిఆర్‌డిఏపిఎం ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

## చవితి వేడుకలను భక్తితో నిర్వహించి హిందూ శక్తిని చాటుదాం

**-వినాయక నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్**

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: తిరుపతిలో జరిగే వినాయక చవితి వేడుకలను ఆదర్శంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించుకుని హిందూ శక్తిని చాటుదామని వినాయక నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఇందిరా మైదానంలో గల స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు వినాయక చవితి సామూహిక నిమజ్జనం మహోత్సవాన్ని పర్యవేక్షిస్తున్న తిరుపతి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని పూజాది కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని మూడవ రోజు ఏర్పాట్లు చేసుకుందామని అన్నారు. దేశ వ్యాప్తంగా జరిగే వినాయకచవితి వేడుకల్లో భాగంగా తిరుపతి వేడుకలు క్రమశిక్షణ, భక్తి విషయంలో ఆదర్శంగా నిలవాలని, అందుకు అందరూ కలిసి కమిటీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి, ఊకా విజయ్‌కుమార్, వెంకటేష్, గుండాల గోపినాథ్, కరాటే శ్రీనివాస్, ఆర్‌సి.మునికృష్ణ, బయ్ అండ్ సేవ్ మధు, ఈతమాకుల హేమంత్‌కుమార్, భాస్కర్‌నాయుడు, డిప్యూటీ మేయర్లు అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు వెంకటేశులు, నరసింహాచారి, టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసు, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర

**అమ్మవారికి సారె సమర్పించిన పవిత్రరెడ్డి**



రేణిగుంట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: ఎంతో మహిమానివ్వత తల్లిగా కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల చేత పూజలందుకుంటున్న రేణిగుంట మండలం కరకంబాడిలో నిండుగా కొలువైన శ్రీశ్రీశ్రీ కట్ట పుట్టాలమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. మంగళవారం భక్తులు అమ్మతల్లికి పొంగళ్లు పొంగించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. కట్ట పుట్టాలమ్మ జాతరకు విశిష్టమై ఖ్యాతి ఉంది. పశ్చిమ ప్రాంతానికి చెందిన భక్తులు అమ్మవారి గుడిని నిర్మించినట్లు ఆ ప్రాంత వాసులు చెబుతారు. చెరువు కట్ట పక్కన పుట్టల్లో అమ్మతల్లి విగ్రహం లభించడం వల్ల అమ్మవారిని భక్తులుకట్ట పుట్టాలమ్మగా పిలిచారని అదే పేరుతో ఆమె స్థిరపడి పోయిందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఎలాంటి సమస్యలు ఉన్న అమ్మవారికి మొక్కుకుంటే క్షణాల్లో తీరిపోతాయని చెబుతారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తరపున ఆయన కుమార్తె పవిత్రరెడ్డి అమ్మవారికి సాంప్రదాయ బద్ధంగా సారె సమర్పించారు. ఆలయ, జాతర నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించి పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆమెతో పాటు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టు బోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాస్, తారకరామనగర్ వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి, పార్టీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, రేణిగుంట సర్పంచ్ నాగేషంతో పాటు స్థానిక వైసీపీ నేతలు ఉన్నారు.

## చనిపోవడం ద్వారా ఏమీ సాధించలేం, ధైర్యంగా బ్రతికి సాధిస్తాం

**రైల్వే ప్రొటెక్షన్ పోర్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. మధుసూదన్**



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : చనిపోవడం ద్వారా ఏమీ సాధించలేం జీవించడం ద్వారా సాధించండని తిరుపతిలో వే ఫౌండేషన్ నిర్వహించిన ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వే పౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ పద్మావతి డిగ్రీ, పిజీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. మధుసూధన్ మాట్లాడుతూ ఆత్మహత్యే అని సమస్యలకుపరిష్కారమైతే ప్రపంచ జనాభాలో సగం మంది అదే చేయాలన్నారు. కానీ ధైర్యవంతులు, జీవితం విలువ తెలిసిన వారు ఆత్మహత్య అనే మాట ఉచ్చరించారు. వందేళ్ల ప్రయాణాన్ని మధ్యలో ఆపే హక్కు మీకు లేదు మీ అమ్మానాన్నలు నీకు ఈ జీవితాన్ని ఇచ్చారు. వారి అనుమతి లేకుండా వారిని ఒంటరిగా వదిలేయడం అన్యాయమన్నారు. భారత్‌లో దాదాపు లక్షమంది డిప్రెషన్ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఒత్తిడిని ఎలా నియంత్రించాలి కూడా ఆయన వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. మహదేవయ్య, ముఖ్య అతిథి కుశాల్, డాక్టర్ అంకయ్య వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, డాక్టర్ శ్రీరాములు చిట్టిబోయిన సామాజిక కార్యకర్త, వారి బృందం హెచ్చరిక సంకేతాలు ముఖ్యంగా విద్యార్థులలో ఆత్మహత్య గురించి అపోహలు, వాస్తవాలు, నివారణ చర్యలపై మాట్లాడారు. ఆత్మహత్యల్లో ఎక్కువ శాతం నివారించదగినవేనన్న వాస్తవాన్ని నొక్కి చెప్పినివారణ పద్ధతులను వివరిం చారు. ఎస్పీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు ఆత్మహత్యలను నివారించి, ఆత్మహత్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిజ్ఞ చేసారు.

## 15 లేయర్లుంటే... నాలుగింటికే అనుమతిస్తే ఎలా?



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరద రాజస్వామి ఆలయం పునర్నిర్మాణానికి సంబంధించి 15 లేయర్లతో నిర్మాణం చేపట్టగా దేవాదాయశాఖ స్థపతి 4 లేయర్లకే అనుమతించగా మిగిలిన 11 లేయర్లకు వెంటనే అనుమతించాలని ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రాష్ట్ర దేవాదాయ శాఖ స్థపతినికోరారు. మంగళవారం వేకువ జామున స్థపతి పరమేశ్వరప్ప శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆలయా నికి అనుబంధంగా పునర్నిర్మాణం జరుగుతున్న వరదరాజస్వామి ప్రాంతాన్ని స్థపతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ కలసి ఆలయ నిర్మాణానికి సంబంధించి చర్చించారు. తాను ఛైర్మెన్‌గా బాధ్యతలుచేపట్టిన తరువాత శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా అప్పగించారు. ఆలయ నిర్మాణం 15లేయర్లతో చేపట్టగా 4 లేయర్లకే అనుమతించటం జరిగిందన్నారు. వర్షాకాలం వస్తుంది. కాబట్టి కుప్పం నుంచి రాతిని ముందుగానే తరలించుకునేందుకు అనుమతించాలని కోరారు. పనుల్లో వేగం పెంచాలని అందుకు మిగిలిన లేయర్లకు అనుమతించాలని అభ్యర్థించారు. ఇప్పటి వరకు నాలుగు లేయర్ల పనులు దాదాపు పూర్తి కావచ్చిందని మిగిలిన లేయర్లకు అనుమతించాలని కోరారు. స్థపతి పరమేశ్వరప్ప సానుకూలంగా స్పందించారు.

## 16 మందిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు

తొట్టంబేడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 16మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే 8మందికి సబ్‌జైలుకు తరలించిన పోలీసులు తాజాగా మరో 8మందిపై నాన్‌బైలబుల్ కేసులు నమోదు చేశారు. సెక్షన్ 147, 353, 307, 732రెడ్ విత్, 149 ఐపిసి, 3పిడిపిపిఎ సెక్షన్‌ల కిందకేసు నమోదు చేశారు. వీరిలో ఎ1గా చెంచయ్యనాయుడు, ఎ2గా కాసరం రమేష్, ఎ3గా రెడ్డివారిగురవారెడ్డి, ఎ4గా సుజిత్‌కుమార్, ఎ5గా వినయ్, ఎ6గా బాలాజీ, ఎ7గా కృష్ణమనాయుడు, ఎ8గా కృష్ణయాదవ్, ఎ9గా పసలరామకృష్ణ, ఎ10గా రామకృష్ణ, ఎ11టీ సన్నీడియోల్, ఎ12గా కోబాకలక్ష్మణ్, ఎ13గా బషీర్, ఎ14గా సలీం, ఎ15గా జగదీశ్వర్‌రెడ్డి, ఎ16గా సుదర్శన్‌రెడ్డిలపై కేసులు నమోదు చేశారు.

## పద్మా అవార్డ్స్-2024కు ఆన్‌లైన్‌లో నామినేషన్లు స్వీకరణ:కలెక్టర్

చిత్తూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం పద్మా అవార్డ్స్-2024 ప్రధానంలో భాగంగా నామినేషన్లను ఆన్‌లైన్‌లో స్వీకరించబడుతుందని కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. పద్మా అవార్డ్స్-2024కు సంబంధించి పద్మ విభూషణ్, పద్మభూషన్, పద్మశ్రీ అవార్డుల కేటగిరీలకు సంబంధించి నామినేషన్లను ఈ నెల 15వ తేదీలోపు వెబ్‌సైట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు.

## అధైర్యపడకండి...ఆదుకుంటాం

**-సబ్‌జైల్లో ఉన్న కార్యకర్తలకు నేతల భరోసా**

తిరుపతి, సెప్టెంబర్ 12ప్రభాతవార్త: పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు ఎప్పుడూ పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడకండి...అన్ని విధాలా ఆదుకుంటామని తిరుపతి ఇన్‌ఛార్జి ఎం. సుగుణమ్మ, ఊకా విజయకుమార్, ఆర్‌సి మునికృష్ణ, దంపూరి భాస్కర్, వట్టికుంట చిన్నబాబు, ఆనంద్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు కలసి మంగళవారం తిరుపతి సబ్‌జైల్లో ఉన్న టిడిపి కార్యకర్తలను కలిశారు. మూడురోజుల క్రిందట అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ సిఎం జగన్ దిష్టిబొమ్మ దగ్ధంచేసిన ఘటనలో మునిశేఖర్‌రాయల్, ఆర్‌పి శ్రీనివాసులు, మహేశ్‌యాదవ్, వెంకటేశ్, రాజయ్య, రాఘవ, వంశీకృష్ణలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో న్యాయవాదితో కలసి నేతలు కార్యకర్తలను పరామర్శించారు.

## గణనాథుని సేవలో తరిద్దాం

**-వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయం ప్రారంభం**



తిరుపతి, సెప్టెంబర్ 12ప్రభాతవార్త: అన్ని వర్గాల ప్రజలు తాము చేపట్టే ఎటువంటి కార్యక్రమం అయినా విజయవంతం కావాలని కోరుతూ ముందుగా వినాయకునికి పూజచేయడం పరిపాటి. అంతటి మహిమాన్వితమైన వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి నగరంలో వినాయక మండపాలు, వినాయక ఉత్సవాలు ఏర్పాటు, నిమజ్జనం వంటి కార్యక్రమాలు పర్యవేక్షించేం దుకు వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. తిరుపతిలో ఈ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, గుండాల గోపీనాధరెడ్డి, ఊకా విజయ కుమార్, ఆర్‌సి మునికృష్ణ, బైఎన్‌సేవ్ మధు, ఈతమాకుల హేమంత్‌యాదవ్, అజయ్‌కుమార్, వెంకటేశ్, దాము, వంశీ, బుజ్జి, కీర్తివెంకయ్య, భాస్కర్‌నాయుడు, మణికంఠ, వాసు, చెంగారెడ్డి తదితరులు ఇందిరామైదానం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఇండోర్‌స్టేడియంలో కార్యాలయం ఏర్పాటుచేశారు. ఈ వినాయక నిమజ్జన మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని మంగళవారం ఉదయం ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డి, నిమజ్జన కమిటీ నాయకులు ప్రారంభించారు. ఈ ఏడాది కూడా మట్టి వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేయాలని, నిబంధనలు పాటించాలని, నిమజ్జనం కూడా నిర్ణీత రోజే చేయాలని కోరారు.

## చంద్రబాబు అరెస్ట్‌పై యుఎస్ఎలో కొవ్వొత్తులతో నిరసన



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : కుప్పం మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లికి చెందిన తెలుగుదేశం యువనాయకుడు కె.ఎ. ఉదయ్‌కిరణ్ అధ్వర్యంలో యుఎస్ఎలోని కనెక్టికట్ నగరంలో ఎన్ఆర్ఐ తెలుగు యువత విభాగం తెలుగుదేశం అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ తామంతా చంద్రబాబు వెంటే ఉంటామన్నారు. తమ ఎన్ఆర్ఐ టిడిపి బృందం చంద్రబాబుకు మద్దతు పలుకుతామన్నారు.

## రెస్కో ఛైర్మన్‌చే ఏడు లక్షల విరాళం



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : కుప్పం రెస్కో ఛైర్మన్ జిఎస్ సెంథిల్‌కుమార్ మరోమారు తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేక కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈకార్యక్రమాల నిర్వహణకు తనవంతుగా రెస్కో ఛైర్మన్ సెంథిల్ కుమార్ మంగళవారం రాత్రి ఏడు లక్షల రూపాయలను విరాళంగా సర్పంచ్ అమర్‌నాథ్, జడ్పీటిసి కృష్ణమూర్తికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందన్, కౌన్సిలర్ సోమశేఖర్, ఆచి అరుణ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## త్వరలో జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు జిల్లా పర్యటన

**-ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥హరిప్రసాద్ వెల్లడి**



-తిరుపతి(విద్య) సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో జనసేన పార్టీ బలోపేతం కోసం ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు త్వరలో జిల్లా పర్యటన చేయనున్నారని, దానిని విజయవంతం చేయాల్సిందిగా జనసైనికులను ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక జన సేన కార్యాలయంలో నగరంలోని జనసైనికులతో డా॥హరిప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగబాబు పర్యటనను విజయవంతం చేసి పార్టీని మరింతగా ముందుకు తీసుకెళ్లడానికి చేపట్టవలసిన కార్యక్రమాల గురించి వివరించారు. రాబోవు 2024 ఎన్నికల్లో జనసేన పార్టీని అధికారం లోకి తీసుకురావడానికి ప్రతి జనసైనికుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, పీలేరు ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేష్, చంద్రగిరి ఇన్‌ఛార్జ్ బీగల అరుణ, రాయల్ వెంకట్, సంజీవి, హరి, శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ కోట వినుత, జిల్లా నాయకుడు కొట్టే సాయి, సత్యవేడు నుండి లావణ్యకుమార్, నగరి దేవా, స్వామినాథన్, శివలింగం, గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పనిచేస్తున్న నాయకులు ఆకేపాటి సుభాషిణి, జిల్లా నాయకులు ఆనంద్, హేమకుమార్, బాటసారి, మండల అధ్యక్షులు, జనసైనికులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన అవనాక్షమ్మ అమ్మవారి జాతర



నారాయణవనం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన అవ నాక్షమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమైనది. మొదటిరోజు మంగళవారం నారాయణవనం మేజర్ పంచాయతీలోని రత్నాంగి, చిత్రాంగి, కోటవీధి, గణపతినగర్‌తో పాటు 3,4వార్డుల్లో కాపురం వుంటున్న సె ంగుంధర్‌మొదలియార్ కులస్తులు (పెద్దకచ్చి)నాలుగురోజుల పాటు జాతరను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అందులో భాగంగా మంగళవారం మొదటిరోజు సెంగుంధర మొదలియార్ కులానికి చెందిన మహిళలు పెద్దఎత్తున ఆలయం వద్దకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవారికి కుంకుమ, పసుపుతో పాటు పుష్పాలను అలంకరి ంచారు. బుధ, గురు, శుక్రవారం అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో వాహనంపై ఊరేగించనున్నారు. చివరి రోజు శుక్రవారం రాత్రి తమిళనాడు రాష్ట్రం సుమారు 100 కిలోల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి పురవీధుల్లో ఊరేగించనున్నారు.

## వైభవంగా పొన్నియమ్మ ఉత్సవాలు



నగరి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటకు గ్రామదేవతలైన పొన్ని యమ్మ ఎల్లమ్మ, ఏకాంబరకుప్పం ప్రాంతానికి గ్రామదేవతలైన తొప్పయమ్మ దేవతలకు ఊరేగింపు ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం పసుపు వస్త్రాలతో వెళ్లి భక్తులు నది నీటిని బిందెల్లో సేకరించి వాటిని తలపై పెట్టుకుని ఊరేగింపుగా నడుస్తూ ఆలయాలకు చేరుకోవడం ఆనవాయితీ. పవిత్ర తను నిరూపించే దిశగా నోటికి గుడ్డలు కట్టుకుని పుష్పపు త్రిశూలం, అమ్మవార్ల విగ్రహాలు తలపై పెట్టుకుని వచ్చిన వీరు పలువురిని ఆకర్షించారు. ఆయా ప్రాంతాల వద్ద గ్రామపెద్దలు వీరికి మంగళ వాయిద్యాలతోను, కోలాటాలతోను స్వాగతం పలికారు. ఊరేగింపుగా తీసుకొచ్చిన పవిత్ర జలంతో ఆలయాల్లోని అమ్మవారి ప్రతిమలకు అభిషేకం చేశారు.

## భక్తిశ్రద్ధలతో చాటుబండి ఊరేగింపు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో గంగజాతర సందర్భంగా మంగళవారం రాత్రి చాటుబండి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దప్పు వాయిద్యాలు చాటు బండిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం కార్వేటినగరం రోడ్డులోని మంచినీళ్ళగుంట నుంచి చాటు బండిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమం కాపువీధి, బజారు వీధి మీదుగా ఉదయం గెరిగె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే దున్నపోతును పురవీధుల్లో ఊరేగించారు. గంగమ్మ మండపం వద్ద అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. మండపం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వేపాకు తోరణాలు విద్యుత్ దీపాలంకరణతో పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని పలు చోట్ల అమ్మవారి ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

# వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తాం:కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: తిరుపతి నగరంలో వినాయక నిమజ్జనానికి మున్సిపల్ కార్పొరేషన్ తరపున అన్ని ఏర్పాట్లను చేయిస్తామని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. మంగళవారం తిరుపతి నగరంలో వినాయక నిమజ్జనానికి చేయాల్సిన ఏర్పాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగర పాలక సంస్థ కార్యాలయంలో నిమజ్జన కమిటీ సభ్యులతో, ఎపి ఎస్పిడిసిఎల్, అగ్నిమాపక, ఆర్టీసి, సమాచార అధికారులు, మున్సిపల్ ఇంజనీర్లతో కమిషనర్ హరిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వినాయక నిమజ్జనం కమిటి కన్వీనర్ సామంచి శ్రీనివా సులు మాట్లాడుతూ తుడా సర్కిల్ వద్ద వినాయక నిమజ్జనం కార్యాలయానికి మున్సిపల్ కార్పొరేషన్ ఆడిటోరియంలో కార్యలయం కేటాయించినందుకు కమిషనర్‌కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఏర్పాటు చేస్తున్న ప్రతి విగ్రహానికి తప్పని సరిగా పోలీసులు, విద్యుత్ అధికారుల అనుమతులు పొందాలన్నారు. ప్రతి ఒక్క విగ్రహ ప్రతిష్టలో సంబంధిత వ్యక్తుల నుండి వివరాలు తీసుకోవడం ద్వారా, భాద్యతగా వహిస్తారని, నగరంలో రహదారులను మూసివేసేలా విగ్రహాలు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. టిటిడి వారి సహకా రంతో మామిడి ఆకుల తోరణాలు, కంకణాలు, అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు ఏర్పాటు చేయిస్తామ న్నారు. అగ్నిమాక అధికారులకు సూచనలుచేస్తూ రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేయడంతో బాటు, తెప్పలను ఏర్పాటు చేయించాలన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణానికి తోడ్పాలని ప్రజలనుద్దేశించి తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత విజ్ఞప్తి చేసారు.